

# నిలిచిన సేంద్రీయ ఎరువుల తయారీ!




- చెత్త లేక ఆగిన పనులు
- నిరుపయోగంగా మారిన సెగ్రిగేషన్ షెడ్లు
- గ్రామాల్లో అడపాదడపా చెత్త సేకరణ
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం..
- ప్రజలు రోగాల బారిన పడేచాన్స్
- నిధులు లేక పారిశుద్ధ్య నిర్వహణ కరవు
- అధికారులు పట్టించుకోవాలని ప్రజల నుంచి పెరుగుతున్న డిమాండ్



**నార్సింగి, జులై 3 (సిరి న్యూస్):**
ప్రభుత్వ పథకం ఏదైనా రూపకల్పన జరగాలంటే ఆ పథకంపై ప్రభుత్వ శాఖల్లోని ఎందరో మేధావుల మేధో మథనం అనంతరం సాధ్యాసాధ్యాలు, కలిగే లాభ నష్టాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి అమలు పరుస్తుంది. ఇక ఆ పథకం అమలు పరచడంతో పాటు ప్రజా క్షేత్రంలోకి తీసుకువెళ్లడం, పథకాల అమలుతో లబ్ధి చేకూర్చడం పూర్తిగా సంభందిత శాఖలపై స్థాయి అధికారుల నుంచి అట్టడుగు స్థాయి వారి పై ఉంటుంది. అటువంటిదే పథకం ఒకటి "ఇంటింటి చెత్త సేకరణ, సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ" గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు పరిచి అటు ప్రజలకు ఇటు రైతులకు లబ్ధి చేకూర్చింది. అప్పటి ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ఇంటింటి నుంచి చెత్తను సేకరించేందుకు ట్రాక్టర్లను అందించి, ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు తో పాటు సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటు చేసింది. రోజూ లేదా రోజు విడిచి రోజు ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా సెగ్రిగేషన్ షెడ్డు కు తరలించి తడి పొడి చెత్తను వేరు చేయడంతో పాటు కంపోస్టు ఎరువు తయారీకి రూపకల్పన చేసి అమలు పరుస్తూ మంచి ఫలితాలను రాబట్టింది. ఈ ప్రక్రియలో తడి చెత్తను షెడ్డులో డీ కంపోస్టు చేయడం తో చెత్త రెండు రోజుల్లో పూర్తిగా కుళ్లి పోతుంది. దీనిని సెగ్రిగేషన్ షెడ్డులో ఉన్న బెడ్ పై వేయడంతో అప్పటికే బెడ్ లో ఉన్న వాన పాములు చెత్తను సేంద్రీయ ఎరువులు గా మారుస్తాయి. సేంద్రీయ ఎరువుల తయారీకి ఉపయోగపడే వాన పాములకు పోషకాలను కూడా అందిస్తారు. వానపాములు తడి చెత్తను పూర్తిగా సేంద్రీయ ఎరువుగా మారుస్తాయి. ఇలా వారంలో దాదాపు ఒకటి నుంచి 2 క్వింటాళ్ల సేంద్రీయ ఎరువు తయారవుతుంది. తయారు చేసిన సేంద్రీయ ఎరువులను 20,50 కిలోల బస్తాల లో విక్రయిస్తారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని అమలు చేస్తూ

### గ్రామాల్లో నిలిచిన చెత్త సేకరణ..

ఇటీవల పంచాయితీ కార్యదర్శులు నిధుల లేమి, చేసిన ఖర్చులకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాక విసిగి వేసారి ఆర్థిక పరమైన విధుల నిర్వహణ తమ వల్ల కాదంటూ, గ్రామ పంచాయితీ ట్రాక్టర్ల తాళం చెవులు ఎంపీడీఓ లకు అందజేశారు. అప్పటి నుంచి మండల పరిధిలోని గ్రామాలలో చెత్త సేకరణ అడపా దడపా జరుగుతున్నా, దాదాపు నిలిచిపోయింది. గ్రామాల నుంచి చెత్త సేకరణ జరగక పోవడం వల్ల ఆయా గ్రామాలలో చెత్త పేరుకు పోవడం తో పాటు సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. చెత్త సేకరణ జరగక పోవడంతో ఉన్నత లక్ష్యం తో మొదలు పెట్టిన ఇంటింటి చెత్త సేకరణ, సేంద్రీయ ఎరువులు తయారి నిలిచి పోయినట్లు అయ్యింది. అసలే వర్షాకాలం, వచ్చే వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ, ఇక దానికి తోడు కొన్ని కొన్ని ప్రదేశాలలో చెత్త పేరుకుపోవడం తో రోగాలు మరింతగా ప్రబలి పరిస్థితి మరింత ఘోరంగా మారే అవకాశం ఉంది. సంభందిత అధికారులు ఇకనైనా స్పందించి చెత్త సేకరణ తో పాటు, సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకు రావాలని, తద్వారా ప్రజల ఆరోగ్యాలతో పాటు, రైతులకు లాభాలు చేకూర్చే సేంద్రియ ఎరువుల తయారీ పునరావృతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

